క్లుప్తంగా

వలంటీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగరాయపురం గ్రామంలో రెండు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. అందులో ఒకటి ఓసీ జనరల్, ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే కళ్లేపల్లి, తామరాపల్లి గ్రామాల్లో ఒక్కో పోస్టు ఉండగా.. వాటిని బీసీ జనరల్ కేటగిరీ అభ్యర్థులకు కేటాయించారు. అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బోదవ్యాధి నియంత్రణకు డీఈసీ మాత్రలు

వేపాడ: బోదవ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్, పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ధరణి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో రెండు సంవత్సరాలు పైబడిన పిల్లలందరికీ డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

వేపాడ: నేటి విద్యార్థులే రేపటి పౌరులని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో ముందుకుసాగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

విజయనగరం ఫూల్‌బాగ్: గజపతినగరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరినాయుడును జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి సస్పెండ్ చేశారు. వర్క్ ఎడ్జిస్ట్‌మెంట్‌కు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయనికారణంగా సస్పెండ్ చేసినట్లు డీఈఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుడిని వేరే పాఠశాల పంపించాల్సి ఉంది. ఆ ఉపాధ్యాయుడుని రిలీవ్ చేయని కారణంగా హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ విజయలక్ష్మి

గంట్యాడ: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బుడతానపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఆ తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

బొండపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని దేవుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. తక్కువ వయసులో పెళ్లి చేయడం వల్ల బాలికల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరదేశమ్మ తీర్థం ప్రారంభం

వేపాడ: మండలంలో చినగుడిపాల గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ప్రారంభమైంది. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం జిల్లాస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపిందలి.

పుణ్యగిరి జాతర ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష



పుణ్యగిరి జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

శృంగవరపుకోట: పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పుణ్యగిరి జాతర ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. వివిధశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లును పర్యవేక్షించాలన్నారు. పుణ్యగిరి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పి.రామకృష్ణ మాట్లాడుతూ.. రైల్వేట్రాక్ తర్వాత రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోవడంతో ఇరుకుగా తయారైందని, భక్తులకు శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణాన్ని అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, స్నానఘట్టం వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లారు. జాతర కోసం కొంత మొత్తం నిధులు కేటాయించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు కోరారు. ఇరుకు రోడ్డులో ఇరువైపుల నుంచి బస్సులు వస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ఎస్సై తారకేశ్వరరావు చెప్పగా.. సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం రమేష్‌కు సూచించారు. దేవస్థానం ఈఓ నాగేంద్ర జాతర ఏర్పాట్లను ఆర్డీఓకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శేషుబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సీఐ సింహాద్రినాయుడు, పుణ్యగిరి ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈబీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులను ప్రోత్సహించాలి



దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు

కొత్తవలస: విభిన్న ప్రతిభావంతులను అన్ని విధాలా ప్రోత్సహించాలని ఎంపీడీఓ వై.పద్మజ అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు సమగ్ర శిక్ష పథకంలో భాగంగా శుక్రవారం ఉచిత ఉపకరణాలను (వీల్ చైర్లు, షిపీ చైర్లు, రొలేటర్లు) అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మానసిక దివ్యాంగ చిన్నారులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఎంఈఓ జి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రతి సోమవారం భవిత కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రానికి వచ్చే పిల్లలతో పాటు వారి సహాయకులకు కూడా రవాణా చార్జీలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు పెదిరెడ్ల కనకరాజు, బొడ్డు అవతారం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.శ్రీరామ్మూర్తి, సీఆర్పీ నాగరాజు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



విజినిగిరిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జామి: మండలంలో విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్ గ్రూప్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి న్యూరో సర్జన్ తమటపు ఈశ్వరరావు, జనరల్ సర్జన్ ఎం.చాణక్య శిబిరంలో పాల్గొని సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గృహసారథులు క్రమశిక్షణతో పనిచేయాలి



విజినిగిరిలో గృహసారథులకు పార్టీ కిట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జేసీఎస్ కన్వీనర్

జామి: గృహసారథులు క్రమశిక్షణతో పని చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ అన్నారు. జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడుతో కలిసి విజినిగిరి, లొట్లపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. పార్టీ అందించిన కిట్లను గృహసారథులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వారికి అప్పగించిన విధులను చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేయాలన్నారు. వారితో పాటు విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, నారాయణరావు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి కథల పుస్తకాలు వితరణ

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ కథల పుస్తకాలను వితరణ చేశారు. ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో పాఠశాలలో మొబైల్ బైక్ లైబ్రరీతో విద్యార్థులకు పుస్తక పఠనంపై శుక్రవారం అవగాహన కల్పించారు. పుస్తక పఠనంతో ఏకాగ్రత, విజ్ఞానం పెంపొందుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామలాసాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా నానిబాబు

దత్తిరాజేరు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా గజపతినగరం ఏఈ నానిబాబు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ధనంజయరావు ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో ఆయన స్థానంలో ఉన్నతాధికారులు నానిబాబును నియమించినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వై.పద్మజ

కొత్తవలస: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వై.పద్మజ సూచించారు. మండలంలోని కొత్తవలస సమీపంలోని లేఅవుట్‌లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ లేఅవుట్‌లో సుమారు 300 మందికి పట్టాలు అందజేసినట్లు చెప్పారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేదంటే పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలను లేఅవుట్‌లో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామ్‌ప్రసాద్, విద్యుత్‌శాఖ ఏఈ అప్పారావు, నరపాం సర్పంచ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార సరుకులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ

జామి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగులకు వైద్యాధికారి భాగ్యరేఖ శుక్రవారం పౌష్టికాహార సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి అభియాన్ పథకం కింద టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. రోగులు క్రమం తప్పకుండా మందులతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని బొద్దాం సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ పి.వెంకటరావు అన్నారు. కొండగంగుబూడి రైతుభరోసా కేంద్రంలో రైతులకు నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో పొలానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. ఫలితంగా ఎరువుల వినియోగం తగ్గడంతో సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రసాయనాలు లేని పంట దిగుబడులు పొందవచ్చన్నారు. అనంతరం ఎస్.కోట సీతారాంపురంలో నవధాన్యాల సాగుపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, గ్రామ సర్పంచ్ బంగారయ్య, సీఎస్‌ఏ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం రాత్రి రెండు పూరిళ్లు దగ్ధమైనట్లు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ తెలిపారు. నిరుపేదలైన బెజవాడ పాపమ్మ, బెజవాడ అప్పలనర్సయ్యకు చెందిన ఇళ్లు కాలిపోవడంతో వారు సర్వం కోల్పోయాలని అన్నారు. ఈ ప్రమాదంపై అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం తరపున బాధితులకు అండగా నిలవాలని కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గుర్ల: మండలంలోని గూడేం గ్రామానికి చెందిన నాసరి సూర్యనారాయణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా రూ.10 వేలును వారికి అందజేశారు. విపత్కర సమయంలో వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ఆయా కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ బీమాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాసరావు, రఘుమండ సూర్యారావు తదితరులు ఉన్నారు.

పశువుల ఆస్పత్రి సందర్శన



వైద్యాధికారితో మాట్లాడుతున్న జేడీ వైవీ రమణ

దత్తిరాజేరు: మండలంలోని మరడాం జాతీయ రహదారి పక్కన ఉన్న పశువుల ఆస్పత్రిని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వైవీ రమణ శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలకు ఇచ్చే రూ.45వేలకు అదనంగా స్త్రీనిధి రుణాలు ఇప్పించి వాటితో పాడిపశువులు కొనుగోలు చేసేలా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి అవినాష్‌కు సూచించారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పశువ్యాధులపై పాడిరైతులను అప్రమత్తం చేయాలని ఏడీ చంద్రశేఖర్‌కు సూచించారు.

గిట్టుబాటు వేతనం పొందేలా చూడాలి



చీపురుపల్లి రూరల్: ఉపాధి పనుల వద్ద వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చీపురుపల్లి రూరల్: ఉపాధిహామీ వేతనదారుకు గిట్టుబాటు కూలీ లభించేలా పనులు చేపట్టాలని ఎంపీడీఓ కె.రామకృష్ణంరాజు సూచించారు. రామలింగాపురం గ్రామంలోని వెంకన్న చెరువు, పుర్రేయవలస గ్రామంలోని రామన్నదొర చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించి వారితో మాట్లాడారు. నిర్దిష్ట సమయానికి పనులకు రావాలని, రెండు పూటలా పనిచేయాలని, కొలతల మేరకు పనులు పూర్తిచేసినట్లయితే గరిష్ఠంగా రూ.257లు వస్తుందన్నారు. పనులకు హాజరైన వారికే మస్టర్లు వేయాలని, తప్పుడు మస్టర్లు నమోదు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని అన్నారు.

19 వరకు సోషల్ ఆడిట్

గంట్యాడ: ఈనెల 10 నుంచి 19 వరకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఏపీఓ ఆదిలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 36 పంచాయతీల్లో ఆడిట్ బృందాలు పర్యటించి ఉపాధి పనులు చేపట్టిన ప్రాంతాలతో పాటు రికార్డులు తనిఖీ చేస్తాయని పేర్కొన్నారు. ఉపాధి సిబ్బంది రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ప్రగతి పథంలో వ్యవసాయ రంగం

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు



మాట్లాడుతున్న మాధవరావు

లక్కవరపుకోట: వ్యవసాయ రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వెలకట్టలేనిదని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీహెచ్ మాధవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ భవనంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ప్రోత్సహించేలా.. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులంతా రుణపడి ఉంటారన్నారు. గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నిర్వహించామన్నారు. మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి మాట్లాడుతూ..ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ముగిసిందన్నారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో పలు ప్రాంతాల్లో రైతులు రబీలో వరి సాగు చేసేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రూపేష్, పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలకు వంతపాడటం తగదు



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శృంగవరపుకోట: లక్షల కోట్ల రూపాయల అవినీతిలో కూరుకుపోయిన పారిశ్రామిక వేత్త అదానీకి కేంద్ర ప్రభుత్వం వంతపాడటం దుర్మార్గమని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతులు, నిరుద్యోగులకు మొండి చేయి చూపారని, విభజనలో నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అదానీ బోగస్ కంపెనీలపై దర్యాప్తు చేయకుండా ప్రధాని ఎదురుదాడికి దిగటం సిగ్గు చేటన్నారు. మంత్రి మండలి అదానీ గ్రూపు సంస్థలకు చేసిన భూకేటాయింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోపాడ మధు, షేక్ స్వామి, కె.భీముడు, వి.గోపి, ఎ.రాజు, పి.ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: పార్టీలకు అతీతంగా..అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు అన్నారు. మండల కేంద్రంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను వారి దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, చందక రమేష్, మంత్రి వెంకటరమణ, వి.భానుచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలి



మాట్లాడుతున్న అంబేడ్కర్ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఉత్తరాంధ్రా అభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతానికి చెందిన యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి చేరినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఇందులో భాగంగా నూతన విద్యా విధానం, సామాజిక అంశాలను అకడమిక్ ప్రాజెక్టులుగా ఇచ్చి వాటికి మార్కులు కేటాయించే పద్ధతి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు ఈరన్న, రవీంద్రనాథ్, శ్రీనివాసరావు, వాసుదేవరావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు



గంట్యాడ: ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు



శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ధర్మవరం హైస్కూల్ విద్యార్థులు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్, బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు తెలిపారు. పాఠశాల ఆవరణంలో శుక్రవారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరచి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ శ్రీరాములు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు పీఎంపాలెం విద్యార్థులు

గంట్యాడ: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు పెదమజ్జిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన పొన్నాడ బాలాదిత్య, ఎస్.రామకృష్ణ, దిలీప్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఈనెల 11 నుంచి 13 వరకు కృష్ణా జిల్లా ఈడుపుగల్లులోని శాప్ స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం ఎం.జి.విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు అభినందించారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ నరసింహమూర్తి

గుర్ల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జమ్ము సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాధమ్మ పాల్గొన్నారు.

ఆధార్ సేవలపై ఆరా



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సేవలు అందించాలని ఎంపీడీఓ ఎ.వేదవతి అన్నారు. మండలంలోని గొట్లాం సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ అందిస్తున్న ఆధార్ సేవలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సేవలను ఉచితంగా అందించాలన్నారు. సచివాలయంలో అందిస్తున్న ఆధార్ అప్‌డేట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ విమలమ్మ సూచించారు. మండలంలోని ఎం.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పరీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్ ప్లాన్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.